## 'విగ్రహం రూపురేఖలు మార్చడం దుర్మార్గం'



తెలంగాణ తల్లిని స్మరించుకున్న బీఆర్‌ఎస్ నేతలు

అమీర్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా తెలంగాణ తల్లి రూపురేఖలు మార్చడం దుర్మార్గమైన చర్య అని ఉద్యమకారుడు గొలుసుల సత్యనారాయణ అన్నారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం అమీర్‌పేట డివిజన్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమసారథి కేసీఆర్ స్వరాష్ట్రం కోసం ఆమరణ దీక్ష చేపట్టి ఢిల్లీ పెద్దల మెడలు వంచడం వల్లే ప్రత్యేక తెలంగాణ సిద్ధించిందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గుడిగె శ్రీనివాస్‌యాదవ్,పాడుగు శ్రీనివాస్‌యాదవ్,శ్రీను, కృష్ణ,శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

## విగ్రహ పునఃప్రతిష్ఠాపన పూజలు ప్రారంభం



ముత్యాలమ్మ విగ్రహ పునః ప్రతిష్ఠాపన పూజలు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ దేవాలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. కొద్దిరోజుల క్రితం అమ్మవారి ఆలయంలో విగ్రహాన్ని దుండగుడు పగులగొట్టగా దేవాదాయ శాఖ అధికారులు దేవాలయం పునర్నిర్మాణంతోపాటు అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠాపన చేపట్టారు. మూడు రోజులపాటు ఈ పూజలు సాగనున్నాయి. గణపతి ఆరాధనతో పూజలు ప్రారంభం కాగా స్థానిక కార్పొరేటర్ కొంతం దీపికతోపాటు స్థానిక భక్తులు, దేవాలయ నిర్వాహకులు పూజల్లో పాల్గొన్నారు. ఈ నెల 11వ తేదీన జరిగే విగ్రహ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్‌తో పాటు పలువురు అధికార, అనధికార, రాజకీయ ప్రముఖులు పాల్గొననున్నారు.

## ఖోఖో చాంపియన్ దోమలగూడ కాలేజీ



దోమలగూడ కాలేజీ ఖో ఖో జట్టు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఖోఖో చాంపియన్‌షిప్‌ను దోమలగూడ ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ జట్టు కైవసం చేసుకుందని డైరెక్టర్ ప్రొ.రాజ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ నెల 7, 8న ఓయూ క్యాంపస్‌లో కేశవ మెమోరియల్ కాలేజీ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్ కాలేజీ ఖో ఖో పోటీల్లో యూనివర్సిటీ పరిధిలోని 20 కాలేజీలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచిన క్రీడాకారులను అంతర్ వర్సిటీల పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

## హానర్ రన్‌లో 'తక్షశిల' విద్యార్థుల సత్తా




మెడల్స్‌ను అందుకున్న తక్షశిల స్కూల్ విద్యార్థులు

లాలాపేట: ఈఎంఈ కార్ప్స్ ఆధ్వర్యంలో ఇటీవల నెక్లెస్ రోడ్డులో నిర్వహించిన సదరన్ స్టార్ హానర్ రన్‌లో శాంతినగర్ తక్షశిల పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు పాల్గొని అద్భుత ప్రతిభను కనభరిచారు. క్రమశిక్షణ, ఆరోగ్య విలువలను చాటిచెపుతూ ఈ సందర్భంగా నిర్వహించిన 4 కిలోమీటర్లు, 5 కిలోమీటర్ల పరుగు పందెంలో విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. దీంతోపాటు స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన బ్యాండ్ డిస్‌ప్లే, యశస్విని కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. అనంతరం నిర్వాహకులు ప్రతిభ కనభరిచిన విద్యార్థులను అభినందిస్తూ మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ తనుప్రీత్ కౌర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాలికల హాస్టల్‌లో స్వెట్టర్ల పంపిణీ



స్వెట్టర్లు పంపిణీ చేస్తున్న వెల్లాల రామ్మోహన్

సనత్‌నగర్: చలి తీవ్రత పెరిగిన దృష్ట్యా బల్కంపేటలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహంలో విద్యార్థినుల ఇబ్బందులకు చలించిన బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ వారికి స్వెట్టర్లు అందజేశారు. హాస్టల్ చిన్నారులు చదువుకునే సమయంలో చలికి వణుకుతున్నట్లు రామ్మోహన్ దృష్టికి వచ్చింది. దీంతో ఆయన స్పందించి స్వెట్టర్లను కొనుగోలు చేసి హాస్టల్‌లో ఉంటున్న వారందరికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలకు ఎల్లవేళలా ముందుంటానని పేర్కొన్నారు. చదువుకు ఏదీ అడ్డంకి కాకూడదన్నారు. నిరుపేద విద్యార్థులు ఉండే బీసీ బాలికల వసతిగృహంలో విద్యార్థులు చలితో ఇబ్బందిపడకూడదనే ఉద్దేశంతో స్వెట్టర్ల పంపిణీ చేసినట్లు చెప్పారు. ముందు ముందు కూడా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

# కౌంటర్ తెరవరు.. ఇక్కట్లు తీరవు!

**కోవిడ్ సమయంలో మూతపడిన సీతాఫల్‌మండి రైల్వే రిజర్వేషన్ కౌంటర్**




సీతాఫల్‌మండిలో కోవిడ్ సమయం నుంచి మూసి ఉంచిన రిజర్వేషన్ కౌంటర్

సికింద్రాబాద్: కోవిడ్ సమయంలో మూతపడిన సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్ ఇంకా తెరుచుకోవడంలేదు. దీంతో సికింద్రాబాద్, పరిసర ప్రాంతాల నుంచి దేశవ్యాప్త ప్రయాణాలు చేసేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరోనా, లాక్‌డౌన్ పరిస్థితులు దూరమై ఏళ్లు గడిచిపోతున్నా రిజర్వేషన్ కౌంటర్ సేవలు పునరుద్ధరించక పోవడం గమనార్హం. సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సంఖ్య పెరగడంతోపాటు అధునాతన వసతులు కూడా అందుబాటులోకి వచ్చాయి. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా రైల్వే అధికారులు వసతులు ఏర్పాటు చేస్తున్నప్పటికీ టికెట్ రిజర్వేషన్ కోసం మాత్రం ఇతర స్టేషన్లకు వెళ్ళాల్సి వస్తోంది. సికింద్రాబాద్ జంక్షన్ పరిసర ప్రాంతాల్లో పలు రైల్వేస్టేషన్లు ఉన్నప్పటికీ రైళ్ల రాకపోకలు, ప్రయాణికుల తాకిడి సీతాఫల్‌మండి స్టేషన్‌కు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఎక్కువ సంఖ్యలోని ఎంఎంటీఎస్ రైళ్ల రాకపోకలకు కేంద్రంగా మారింది. నాలుగు ప్లాట్‌ఫామ్‌లతో కూడిన ఈ రైల్వేస్టేషన్ నుంచి 40 ఎంఎంటీఎస్ రైళ్లు, 20 వరకు సాధారణ, ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. రెండు వేలకు పైచిలుకు ప్రయాణికులు వచ్చి వెళుతున్నారు. మరో అదనపు లైన్ నిర్మాణం కోసం పనులను ఇటీవలే పూర్తి చేశారు.

ఇబ్బంది పడుతున్న పరిసర ప్రాంతాల ప్రజలు ఎంఎంటీఎస్ రైళ్లతోపాటు మహబూబ్‌నగర్, నిజామాబాద్, మనోహరాబాద్, నాందేడ్, మేడ్చల్, వాడి, పెద్దపల్లి తదితర మార్గాలకు కాచిగూడ నుంచి వెళ్లే అన్నీ రైళ్లను ఇక్కడ నిలుపుతున్నారు. సీతాఫల్‌మండి, వారాసిగూడ, తార్నాక, చిలకలగూడ, మెట్టుగూడ తదితర ప్రాంతాల ప్రజలు ఇక్కడి నుంచి వివిధ మార్గాలకు ప్రయాణాలు చేస్తున్నారు. రైలు ప్రయాణికులకు అన్ని రకాల సంతృప్తికర సేవలు అందిస్తున్న సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ సేవలు అందుబాటులోకి రాకపోవడంతో ఈ ప్రాంత ప్రజలకు ఇబ్బందుల పాలవుతున్నారు. కోవిడ్ లాక్‌డౌన్ ముందు వరకు ఈ రైల్వేస్టేషన్‌లో దేశవ్యాప్తంగా అన్ని రైళ్లకు టికెట్ రిజర్వేషన్ సేవలు ఇక్కడ అందుబాటులో ఉండేవి. ఇప్పటికీ ఇక్కడి కౌంటర్‌ను తెరవకపోవడంతో గత్యంతరం లేక ఈ ప్రాంత ప్రజలు రద్దీగా ఉండే సికింద్రాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్లను ఆశ్రయించాల్సి వస్తోంది. సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్‌లో రిజర్వేషన్ సేవల కౌంటర్‌ను అందుబాటులోకి తీసుకువస్తే ప్రయాణికుల ఆదరణ మరింత పెరిగే అవకాశం ఉంది.

## విదేశీ విద్యానిధి నిధుల విడుదలకు లేఖ

ఉస్మానియా యూనివర్సిటీ: మహాత్మ జ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి పథకం నిధులు విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం లేఖ రాసినట్లు తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల నిధుల విడుదలలో జాప్యం నెలకొందని, విదేశాల్లో చదువుతున్న బీసీ విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పు చేసి విదేశాల్లో చదివిస్తున్న తల్లిదండ్రులు వడ్డీలు చెల్లించలేకపోతున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు విడుదల చేయాలని లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు.

## ఉదయ్‌నగర్ అసోసియేషన్ ఎన్నికలు 22న

సనత్‌నగర్: ఉదయ్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 22న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈ నెల 11న నామినేషన్ల దాఖలు చేయాలని ఎన్నికల అధికారులు పూర్మానీ మల్లారెడ్డి, అనంతరెడ్డి తెలిపారు.

# ఓయూలో అధ్యాపకుల కొరత

- పాలనా పదవుల్లో పర్మనెంట్ అధ్యాపకులు
- బోధనకు పార్ట్‌టైం లెక్చరర్లు... పడకేసిన పరిశోధనలు
- ఆగిన పీహెచ్‌డీ నోటిఫికేషన్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో అధ్యాపకుల కొరతతో బోధన కుంటుపడింది. పరిశోధన కూడా పడకేసింది. అధ్యాపక పోస్టులు చాలాకాలంగా భర్తీకాకుండా ఖాళీగా ఉన్నాయి. కొద్దిమంది పర్మనెంట్ అధ్యాపకులు ఉండగా, వారిని పాలన పదవుల్లో నియమించారు. దీంతో కాంట్రాక్టు అధ్యాపకులు, పార్ట్ టైం లెక్చరర్లతో పాఠ్యాంశాల బోధన కొనసాగిస్తున్నారు. వర్సిటీలలో కేవలం బోధనతో సరిపోదని, జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులకు పర్మనెంట్ అధ్యాపకుల సంఖ్య, పరిశోధనలు, ప్రాజెక్టులు అత్యంత ప్రధానమని పలువురు అధ్యాపకులు, విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు. గత 15 ఏళ్లుగా పర్మనెంట్ అధ్యాపకుల నియామకాలు లేవు. దీంతో ఇప్పుడు కేవలం 350 అధ్యాపకులు మాత్రమే ఉన్నారు. అందులో పీహెచ్‌డీ గైడ్‌షిప్ చేయడానికి కేవలం 150 మందికి మాత్రమే అర్హత ఉంది. దీంతో పీహెచ్‌డీ గైడ్‌షిప్ కోసం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఏటా 1,200 మంది పీహెచ్‌డీ విద్యార్థులు ప్రవేశం పొందగా గత ఆరు సంవత్సరాలుగా పీహెచ్‌డీ ప్రవేశాలు నిలిచిపోయాయి. ఇటీవల కేటగిరీ–1 (యూజీసీ నెట్, జేఆర్‌ఎఫ్) పీహెచ్‌డీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేసినా ప్రొఫెసర్లు లేనందున దరఖాస్తు చేసుకునేవారికి ప్రవేశాలకు దక్కని పరిస్థితిని నెలకొంది. పీహెచ్‌డీ కేటగిరీ–2 నోటిఫికేషన్(ఎంట్రన్స్ ద్వారా ప్రవేశాలు) విడుదల చేయాలని పీజీ పూర్తి చేసిన విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఆరు సంవత్సరాల నుంచి కేటగిరీ–2 పీహెచ్‌డీ ప్రవేశాలు లేనందున విద్యార్థులు నిరుత్సాహంతో ఉన్నారు.

## సీసీ రోడ్డు పనుల పర్యవేక్షణ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ వారాసిగూడ స్టేట్‌బ్యాంకు లైన్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ సామల హేమ సోమవారం పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ ఇక్కడ రోడ్డు నిర్మాణ పనులను రూ.14 లక్షల వ్యయంతో చేపట్టినట్లు తెలిపారు.త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆమె అధికారులను కోరారు. నాణ్యతాప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం ఆమె స్థానికులతో మాట్లాడి అక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్‌ఎస్ నాయకులు జాకీర్, అజ్గర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ ప్రక్రియ ముమ్మరం

- సర్వే వివరాల నమోదుపై అధికారుల ప్రత్యేక దృష్టి
- 15 కల్లా పూర్తి చేసేందుకు కసరత్తు



సికింద్రాబాద్: జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ (సర్కిల్–29) పరిధిలో చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ వేగంగా సాగుతోంది. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ఐదు డివిజన్ల పరిధిలో 80 శాతం కుటుంబాలకు చెందిన వివరాలను ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి సేకరించారు. ప్రజల నుంచి సేకరించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ స్థితిగతులను అధికారులు నివేదికలుగా రూపొందించనున్నారు. సర్కిల్ పరిధిలో 80 వేల పై చిలుకు గృహాలు ఉన్నాయి. ఇందులో 69 వేల గృహాలకు సంబంధించిన కుటుంబాల వివరాలు మాత్రమే ఎన్యుమరేటర్లు సేకరించగలిగారు.

**సర్వేలో 600 మంది ఎన్యుమరేటర్లు**

గత నెలాఖరు వరకు 600 మంది ఎన్యుమరేటర్లు సర్వేలో పాల్గొని సమాచారాన్ని సేకరించారు. దీన్ని ఐదుగురు నోడల్ అధికారులు, 59 మంది సూపర్‌వైజర్లు పర్యవేక్షించారు. సంబంధిత సమాచారాన్ని లాలాపేట ఇండోర్ స్టేడియంలో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. స్టేడియంలో ప్రత్యేకంగా ఆన్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 60 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించడంతో.. ప్రతి రోజూ మూడు షిఫ్టుల్లో వారంతా పనిచేస్తున్నారు. దీంతో సర్వే వివరాలు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోందని జీహెచ్‌ఎంసీ సర్కిల్–29 ఉప కమిషనర్ డి.సుభాష్‌రావు తెలిపారు. ఈ నెల 4న ప్రారంభమైన ఈ ప్రక్రియను 15 వరకు పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని ఆయన చెప్పారు. తప్పులకు తావులేకుండా అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఇదిలా ఉండగా మరో 11 వేల గృహాలకు సంబంధించిన కుటుంబాల వివరాలు ఎన్యుమరేటర్లు సేకరించలేకపోయారు. పలువురు నిర్దేశిత చిరునామాల్లో లేకపోవడం, కొన్ని గృహాలకు తాళాలు వేసి ఉండటం, మరికొందరు సర్వే సిబ్బందికి వివరాలు ఇచ్చేందుకు సహకరించని కారణంతో పెండింగ్‌లో ఉన్నాయి. మరోమారు ఎన్యుమరేటర్లను సర్వేకు పంపించి అందరి వివరాలు సేకరించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

## అలరించిన ద్రౌపది స్వయంవరం హరికథ

నల్లకుంట: నల్లకుంట శంకరమఠంలో హరికథ పితామహుడు శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణ దాస, నేతి లక్ష్మీనారాయణ భాగవతుల జయంతి హరికథ మహోత్సవాలు నేత్ర పర్వంగా కొనసాగుతున్నాయి. మహోత్సవాల్లో రెండో రోజైన సోమవారం సాయంత్రం ఎస్. చిరంజీవాచార్యులు 'ద్రౌపది స్వయంవరం'పై హరికథ గానం ఆహూతులను ఆకట్టుకుంది. దీనికి వయోలిన్‌పై దక్షిణామూర్తి, బి. శ్రీపతిరావు, మృదంగంపై సుధాకర్ వాద్య సహకారం అందించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ కన్వీనర్ యనమండ్ర వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ.. దివంగత నారాయణదాసు ఒకసారి కలకత్తాలో 'శ్రీకృష్ణ జననం'పై సంస్కృత గానం చేయడం విని మంత్రముగ్ధుడైన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాకూర్ ప్రశంసించడం గొప్ప విషయమన్నారు.

**నేడు 'భక్త అంబరీష'పై హరికథ గానం..**

సోమవారం సాయంత్రం సప్నా భారతి భాగవతారిణిచే 'భక్త అంబరీష'పై హరికథ గానం ఉంటుందని ప్రోగ్రామ్ కన్వీనర్ యనమండ్ర వెంకటకృష్ణయ్య తెలిపారు.



'ద్రౌపది స్వయంవరం'పై హరికథాగానం చేస్తున్న ఎస్.చిరంజీవాచార్యులు

## ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.23, నల్లవంకాయ రూ. 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 28, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 33, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 23, పందిరి బీర 35, క్యాబేజీ 18, క్యారెట్ 53, దొండ 35, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 40, గోకర కాయ 28, కీర 24, దోసకాయ 23, బీట్ రూట్ 47, ఉల్లిగడ్డ 45, ఆలుగడ్డ 35, చామగడ్డ 35, మొరంగడ్డ 28, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

## సికింద్రాబాద్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా కృష్ణారావు



అనంత కృష్ణారావు

అడ్డగుట్ట: ఇటీవల జరిగిన తెలంగాణ యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా అనంత కృష్ణారావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గ యువతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


## ఘనంగా శ్రీదత్తాత్రేయ జయంతి



ప్రత్యేక అలంకరణలో శ్రీదత్తాత్రేయస్వామి

సనత్‌నగర్: శ్రీహనుమాన్ దేవాలయ ప్రాంగణంలో కొలువుదీరిన శ్రీదత్తాత్రేయ జయంతి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు ప్రత్యేక అలంకరణలు, స్వామి వారికి అభిషేకం, అర్చన, హారతి, ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో అర్చకులు విశేష పూజలు కొనసాగుతున్నాయి.

## జీటీఎస్ హుండీ ఆదాయం రూ.2.82,146



జీటీఎస్ హుండీని లెక్కిస్తున్న భక్తులు

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జీటీఎస్ దేవాలయం హుండీని సోమవారం లెక్కించారు. మొత్తం హుండీ ఆదాయం రూ. 2,82,146 వచ్చినట్టు ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి గుమ్మడిదల సుధాకర్ తెలియజేశారు. గత రెండున్నర నెలలకు గాను భక్తులు సమర్పించిన ఆదాయంగా తెలిపారు. హుండీ ద్వారా లభించిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి దేవాదాయ ధర్మాదాయశాఖ నిబంధనలకు అనుగుణంగా వెచ్చించడం జరుగుతుందని ఈ.ఓ.పేర్కొన్నారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ డి.మధుబాబుతో పాటుగా పలువురు జీటీఎస్ దేవాలయ పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

## కలుషితనీటి సమస్యను పరిష్కరిస్తాం: జీఎం



వెంకట్‌నగర్‌లో పనులను పరిశీలిస్తున్న జలమండలి జీఎం వినోద్‌కుమార్




'సాక్షి'లో ప్రచురితమైన కథనం

అడ్డగుట్ట: కలుషిత నీటి సరఫరా సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని జలమండలి జీఎం వినోద్‌కుమార్ తెలిపారు. తుకారాంగేట్ వెంకట్ నగర్‌లో రెండు వారాలుగా కలుషితనీటి సరఫరాతో స్థానికులు అనేక అవస్థలు పడుతున్నారంటూ సోమవారం 'సాక్షి'కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన జలమండలి జీఎం వినోద్ కుమార్ వెంకట్‌నగర్ ప్రాంతంలో పర్యటించారు. కలుషిత నీటి సరఫరా సమస్య గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పురాతన పైప్‌లైన్ వల్ల బస్తీలో తాగునీరు కలుషితమవుతున్నాయన్నారు. కలుషిత నీటి సమస్యను పరిష్కరించేందుకు ఇప్పటికే పనులు కూడా జరుగుతున్నాయని తెలిపారు. ఆయన వెంట మారేడుపల్లి జలమండలి డీజీఎం విద్యా సాగర్, సిబ్బంది శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

# అసంపూర్తి రోడ్డుపై అగచాట్లు



లలితనగర్‌లో పూర్తిగా రోడ్డు వేయకుండా వదిలేసిన అధికారులు

బౌద్ధనగర్: బౌద్ధనగర్ డివిజన్‌లోని లలితానగర్‌లో సీసీ రోడ్డు పనులు పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలేసి వెళ్లడంతో స్థానికులు, వాహనచోదకులు అనేక ఇక్కట్లు గురవుతున్నారు. ఇటీవల లలితనగర్ కాలనీ మెయిన్‌రోడ్డు మార్గంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. అయితే, కాంట్రాక్టర్ ఒకవోట రోడ్డు పూర్తిగా వేయకుండా కొంత మేర వదిలేసి వెళ్లిపోయారు. అప్పటి నుంచి అసంపూర్తిగా ఉన్న ఆ రోడ్డుపై ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు వాహనదారులు అదుపుతప్పి కింద పడిపోతున్నారు. మిగిలిన రోడ్డు కూడా వేసి సమస్యను పరిష్కరించాలంటూ అధికారులను కోరినా వారు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## '60 ఏళ్లుగా ఉంటున్న మా ఇళ్లను కూల్చారు'

పంజగుట్ట: సుమారు 60 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న తమ 19 ఇళ్లను కూల్చేశారని ప్రభుత్వం, అధికారులు స్పందించి తమకు ప్రత్యామ్యాయం చూపాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు వడ్డెపల్లి ఎం.బి.కృష్ణ ఆనంద్, జ్ఞానేశ్వర్, సువర్ణలు మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గం, గాంధీనగర్ మున్సిపల్ డివిజన్‌లోని వివేకానందనగర్ బస్తీ 1957లో ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. 1974లో బస్తీకి రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ అన్ని సదుపాయాలు కల్పించారని తెలిపారు. ఇక్కడ మొత్తం 23 దళితుల ఇండ్లు ఉంటాయన్నారు. కాగా ఈ బస్తీకి ఆనుకునే 1988లో జనప్రియ వారు డవలప్‌మెంట్ చేసి బస్తీ రోడ్డుకు అడ్డంగా ఉందని, దీన్ని తొలగించాలని కోర్టులో కేసు వేశారని తెలిపారు. కోర్టు కలెక్టర్‌ను వివరణ కోరగా అప్పటి కలెక్టర్ వీరు ఎంతో కాలం నుంచి అక్కడ ఉంటున్నారని వీరికి ప్రత్యామ్యాయం చూపించిన తరువాత నివాసాలు తొలగించి రోడ్డు విస్తరిస్తామని లిఖిత పూర్వకంగా చెప్పినట్లు తెలిపారు. తదనంతరం మరో డవలపర్స్ సంస్థ వచ్చి తమ ఇండ్లు కూల్చేయ్యాలంటూ తిరిగి కోర్టును ఆశ్రయించారని తమ కేసు కోర్టులో ఉండగానే ఈ సంవత్సరం జనవరి 29వ తేదీన తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, ప్రత్యామ్యాయం చూపకుండా 23 ఇండ్లల్లో 19 ఇండ్లను కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కూల్చేసిన 19 ఇండ్లల్లో 5 ఇండ్లకు రిజిస్ట్రేషన్ ఉందని, ప్రతీ సంవత్సరం ప్రభుత్వానికి ట్యాక్స్‌లు కూడా చెల్లిస్తున్నామని తెలిపారు. తాము ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లినా న్యాయం దక్కలేదని, దీంతో ఢిల్లీలోని జాతీయ ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించామని తెలిపారు. సంపన్నుల ఒత్తిడి మేరకు దళిత కుటుంబాలను రోడ్డుపాలు చేయడం ఎంత వరకు సబబని ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

## గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి

పంజగుట్ట: గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు ఒక్క సంవత్సరంలోనే 42 మంది వివిధ కారణాల వల్ల చనిపోవడం బాధాకరమని ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం అధ్యక్షుడు మచ్చ నర్సయ్య కోరారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 1009 వివిధ గురుకులాలు ఉన్నాయని నిత్యం ఏదో ఒక ఘటన జరగటం బాధాకరమన్నారు. ముఖ్యంగా బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందటం లేదన్నారు. పెండింగ్ నిధులు వెంటనే విడుదల చేయడంతోపాటు, మూడు నెలల బిల్లులు అడ్వాన్స్‌గా చెల్లించాలన్నారు. చాలా గురుకులాలు అద్దెభవనాల్లో అరకొర వసతులతో ఉన్నాయని, అన్నింటికీ సొంత భవనాలు నిర్మించాలని కోరారు. గురుకులాల కొత్త చైర్మన్ తల్లిదండ్రులు పిల్లల్ని కలవకూడదు అని జీవో తీసుకువచ్చారని దాన్ని వెంటనే ఉపసంహరించుకుని పిల్లల్ని కలిసే అవకాశం కల్పించాలని కోరారు. అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులతో పాఠశాల యాజమాన్య కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్యదర్శి ఎస్.వెంకటేశ్, మెట్ల శంకర్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న మచ్చ నర్సయ్య